క్లుప్తంగా

ప్రజా సంక్షేమానికి కృషి



అలంపూర్: నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఉండవెల్లి మండలం తక్కశీల గ్రామానికి చెందిన షేక్ చిన్నకాసీం మియాకు, రూ.5 లక్షలు, మానవపాడు మండలం గోకులపాడు గ్రామానికి చెందిన నవ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షల ఎల్‌ఓసీ వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ధరూరు: మండల కేంద్రంలోని ఎంజేపీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బంగి హుసేనప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఇంటర్, టెన్త్, మెమోలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని పేర్కొన్నారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

ఇటిక్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ 151 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచకుండా కాలాయాపన చేయడం తగదన్నారు. రిజర్వేషన్లను పరోక్షంగా కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బాబు, జమ్మన్న, యోబు, దానం, జేమ్స్, జానయ్య, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్‌ఎస్ రాద్ధాంతం

అలంపూర్: బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్‌ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు అన్నారు. పట్టణంలోని టూరిజం హోటల్‌లో టీడీపీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి నీళ్లు సముద్రంలోకి వెళ్లకుండా దాన్ని వినియోగించుకోవాలని అందుకు కేసీఆర్ పెద్దన్న పాత్ర పోషిస్తానని గతంలో చెప్పినట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటామని చెప్తున్నారని కానీ ఏపీ సీఎం చంద్రబాబునాయుడు గోదావరి జలాలు రెండు రాష్ట్రాలకు ఉపయోపడాలని కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు పోటీపడి ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, భూపాల్, అబ్దుల్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

అయిజ: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ కోరారు. గురువారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఈశ్వర్, హమాలీ సంఘం నాయకులు శ్రీను, మహేంద్ర, అడివెన్న, శంకర్ గౌడ గోవిందు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురి బైండోవర్

మానవపాడు: జాతీయ రహదారి సమీపంలోని పరమేశ్వర గుడి వద్ద బుధవారం రాత్రి అనుమానాస్పదంగా సంచరిస్తున్న 5 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పరమేశ్వరస్వామి ఆలయం సమీపంలో నారాయణపేట జిల్లా మరికల్ మండలం జకిలేరు గ్రామానికి చెందిన మహేష్, వినోదు, మైబు, బాలకృష్ణ, కొండన్న సంచరిస్తుండగా కానిస్టేబుల్ రాజారామ్ అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. గురువారం తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో 5మందిని బైండోవర్ చేసి, మరోసారి అనుమానంగా తిరిగితే రూ. 1లక్ష చొప్పున జరిమానా విధిస్తామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

సమస్యల వలయంలో కేజీబీవీ



ఎర్రవల్లి కూడలి సమీపంలోని కస్తూర్బా పాఠశాల

- మౌలిక సదుపాయాలు లేక అవస్థలు
- పాఠశాలకు శాపంగా మారిన బావిగుంత
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

ఎర్రవల్లి: బాలికల చదువును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి మండలంలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ఏర్పాటు చేసింది. కానీ విద్యాలయాల్లో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థినులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పుట్టెడు సమస్యలు వెంటాడుతుండటంతో నిత్యం వాటితో సావాసం చేయలేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుంతలో నిండా చేరిన మురుగు

ముప్పుగా మారిన గుంత

పాఠశాలను నిర్మించే క్రమంలో భవనం కోసం ఆవరణలో మట్టిని అధికంగా తవ్వడంతో పెద్దగుంత ఏర్పడింది. పాఠశాలకు ఆనుకొని ఉండటంతో నిత్యం విషసర్పాలు సంచరిస్తున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు. వర్షాకాలంలో బావి గుంతలో నీరు చేరడం వల్ల మురుగుగా మారి దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు.



ప్రహరీ లేకుండా గుంతలతో ఉన్న పాఠశాల ఆవరణ

సౌకర్యాలు లేని డార్మిటరీ

డార్మిటరీలో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. రాత్రుళ్లు నిద్రపోవాంటే దోమల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నామని, చదువుకునేందుకు కనీసం లైట్లు, ఫ్యాన్లు కూడా లేవని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రహరీ లేక అవస్థలు

పాఠశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీ నిర్మించకపోవడంతో నిత్యం విషపురుగులు, పశువులు, గొర్రెలు సంచరిస్తున్నాయి. పాఠశాల ఆవరణ కూడా అపరిశుభ్రంగా ఉందంటున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల సమస్య వేధిస్తున్నట్లు వాపోతున్నారు. పలుమార్లు కలెక్టర్, ఎమ్మెల్యేలు వసతి గృహాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారే తప్పా సమస్యలు పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యాలయంలో సమస్యలు తక్షణమే పరిష్కరించాలని విద్యార్థినులు వేడుకుంటున్నారు.

విషపురుగుల సంచారం



పాఠశాలకు పూర్తిస్థాయిలో ప్రహరీ లేక ప్రతిరోజు ఆవరణలోకి విష పురుగులు రావడంతో నిత్యం భయాందోళనలో ఉంటున్నాం. అధికారులు స్పందించి వెంటనే ప్రహరీని పూర్తిస్థాయిలో నిర్మించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి.

– లావణ్య, 9వ తరగతి

జ్వరాల బారిన పడుతున్నాం



పాఠశాల ఆవరణలో ఉన్న గుంతలో మురుగు చేరి ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫ్యాన్లు లేక రాత్రి వేళల్లో కంటిమీద కునుకు లేకుండా పోతుంది. దోమలు అధికంగా వ్యాప్తి చెందడంతో విషజ్వరాల బారిన పడుతున్నాం.

– జయలక్ష్మి, 8వ తరగతి

నిధుల కొరత



ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కొరత కారణంగా పాఠశాలలోని పలు సమస్యలు పరిష్కరించలేకపోతున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. దాతలు సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావాలి.

– స్వర్ణలత, పాఠశాల ప్రత్యేక అధికారి

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న కలెక్టర్ సంతోష్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ త్వరితగతిన ఇల్లు నిర్మించుకోవాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 లక్షలు విడతల వారీగా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం 480 మంది ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ సంగీతలక్ష్మి, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గద్దం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

మల్దకల్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను బట్టి బోధన ఉండాలన్నారు. విద్యార్థుల మేధాశక్తిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం తరగతి గదులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజన విషయంలో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

రాజోళి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు దృష్టి పెట్టాలని తహసీల్దార్ పి.రామ్మోహన్ అన్నారు. ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక వసుతల కల్పనపై దృష్టి పెట్టడంతో పాటు, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల కొరత, విద్యా ప్రమాణాలు పెంచడం, విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, ఏఏపీ చైర్మన్లు బుజ్జమ్మ, మానస, హసీనాబేగం, పద్మమ్మ, మద్దమ్మ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ పి.రామ్మోహన్

రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలి



మాట్లాడుతున్న ఏపీఎం మార్తమ్మ

రాజోళి: మహిళల సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా వారికి అవగాహన కల్పించాలని ఏపీఎం మార్తమ్మ అన్నారు. మండల కేంద్రంలో గురువారం గ్రామ సమాఖ్య లీడర్లు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘాల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే వారికి ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది, ఆలస్యం చేయడం, రుణాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉండటం వల్ల కలిగే నష్టాల గురించి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీసీలు బుచ్చన్న, మద్దిలేటి, వీఓఏలు రాజేష్, జయన్న, శేఖర్ రజియా తదిదరులు పాల్గొన్నారు.

భరోసాతో పిల్లలను బడికి పంపండి

అలంపూర్: ఉపాధ్యాయులపై భరోసాతో ప్రభుత్వ పాఠశాలకు పిల్లలను పంపించాలని మండల విద్యాధికారి అశోక్‌కుమార్ అన్నారు. అలంపూర్ మండలం సింగవరం–1 గ్రామంలో ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులతో కలిసి గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని కోరారు. విద్యార్థుల సంఖ్యకు అనువుగా ఉపాధ్యాయులను భర్తీ చేస్తారన్నారు. ప్రభుత్వ బడి అమ్మ ఒడిలాంటిదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం ఉచిత పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్, పౌష్టికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, జీహెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు శివశంకరాచారి, సీఆర్‌పీ పెద్ద ఈదన్న, పంచాయతీ కార్యదర్శి హసీనాబేగం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామసభలో విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మెగా వైద్య శిబిరంలో సిబ్బంది, అధికారులు



వైద్య శిబిరంలో బారులు తీరిన వృద్ధులు

అలంపూర్: గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పల్మనాలజిస్ట్ వైద్యుడు మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని బుక్కాపురం గ్రామంలో క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ ముక్త్ భారత అభియాన్, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ, వీఎస్టీ సంజీవని, క్యాతూర్ పీహెచ్‌సీ వైద్యులు సంయుక్తంగా 251 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ముందులు అందజేసినట్లు తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆయాసం, జ్వరం ఉంటూ రాత్రి సమయాల్లో చెమటపట్టడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి సమస్యలు ఉన్న 22 మందిని, టీబీ అనుమానితులను 45 మందిని గుర్తించినట్లు తెలిపారు. శాంపిల్స్‌ను సేకరించి గద్వాల టీబీ హబ్‌కు పంపినట్లు తెలిపారు. వ్యాధి గ్రస్తులకు ఆరు నెలలపాటు ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం పలు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైద్య అధికారి ప్రతిభస్ఫూర్తి, ఎంపీహెచ్‌ఈఓ సాదిక్, వీఎస్టీ సంజీవని డాక్టర్ భరత్, మండల వైద్య విస్తరణ అధికారి సత్యనారాయణ, డీపీసీ నరేంద్ర, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ గురుబసవయ్య, టీబీ నోడల్ పర్సన్ నాగశేషయ్య, ఐటీసీ కౌన్సిలర్ రవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలి

మల్దకల్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని ఉలిగేపల్లిలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, రఘు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మట్టిఎద్దుల ఊరేగింపు



కేటీదొడ్డి: మండలంలోని కుచినెర్ల గ్రామంలోని మట్టి ఎద్దుల అమావాస్య సందర్భంగా గురువారం శంబులింగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మట్టి ఎద్దులను పూజించి గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపును తిలకించేందుకు వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

గట్టు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని మాజీ సర్పంచ్ సిద్ధిరామప్ప అన్నారు. గురువారం మాచర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకులు భూమిపూజ నిర్వహించారు. అలీ, సురేష్, శ్రీసివారెడ్డి, రాజుగౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

మానవపాడు: మండలంలోని బోరవెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వివరాలను ఎంపీడీఓ భాస్కర్ పరిశీలించారు.

ఎమ్మార్సీ ఎదుట మహిళల నిరసన



ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

అయిజ: మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి హైస్కూల్ సమీపంలోని బుక్‌స్టోర్‌కు అధికారులు తాళం వేయడంతో గురువారం ఉదయం ఎమ్మార్సీ ఎదుట మహిళలు నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాములు ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం విద్యార్థి సంఘాల నాయకులు ఎంఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్సీ కార్యాలయం ముందు ఆందోళన చేసింది విద్యార్థుల తల్లిదండ్రులు కాదని వారి పేర్లతో పాఠశాల సిబ్బంది నిరసన చేపట్టినట్లు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాల అనుమతులు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాషా, పీవైఎల్ జిల్లా కార్యదర్శి హరీష్, బీఆర్‌ఎస్వీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



చిన్నపాడులో హెచ్‌ఎంతో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

అలంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని హరిజనవాడ పీఎస్ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీ సిబ్బంది పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుచితోపాటు శుచి పాటించాలి

ధరూరు: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతతో పాటు రుచిగా ఉండాలని మండల ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. మండల పరిధిలోని చిన్నపాడు ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడారు. భోజన నాణ్యత విషయంలో రాజీపడొద్దన్నారు. అశ్రద్ధ చూపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాఘవాచారి, సీఆర్‌పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక శ్రేయస్సును తీసుకురావడమే లక్ష్యం

అయిజ: మండల కేంద్రంలోని వీరబ్రహ్మంగారి ఆలయంలో గురువారం బీజేపీ నాయకులు ఏకల్ అభయాస్ మాసవర్గ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంచ్ ప్రెసిడెంట్ భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని మారుమూల గ్రామాలకు అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక శ్రేయస్సును తీసుకురావడమే లక్ష్యమన్నారు. డిజిటల్ అక్షరాస్యత, మహిళా సాధికారిత, ఆరోగ్య సేవలు, స్థిరమైన వ్యవసాయం, ఉద్యోగాలు, నైపుణ్య శిక్షణ వంటి వాటితో ఏకల్ సమగ్ర గ్రామ అభివృద్ధి విస్తరిస్తోందన్నారు. కార్యక్రమంలో అంచల్ అభియాన్ మహదేవమ్మ, సంచు ప్రముఖ్ రంగనాథ్, సంచ్ సాదక్ సోమేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

మానవపాడు: మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ టాటాబాబు, సీడీపీఓ సుజాత సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. మాదకద్రవ్యాలను నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణగా నిలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దేశాన్ని పెనుభూతంగా మారుస్తున్నా మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మిలించాలని, ఎవరైనా మాదకద్రవ్యాలు అమ్మినా, కొన్నా పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రకాంత్, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో అవగాహన కల్పిస్తున్న సీఐ టాటాబాబు, సీడీపీఓ సుజాత

మత్తుకు అలవాటైతే భవిష్యత్ ఆగమే

రాజోళి: మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ ఆగమవుతుందని ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి అన్నారు. వడ్డేపల్లి జెడ్పీహెచ్ పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం వలన జరిగే అనార్థాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

రాజోళి: అలంపూర్ పట్టణంలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి కోరారు. గురువారం శాంతిగనర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కార్యకర్తలకు పలు అంశాలపై తరగతులు నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, ముఖ్య నాయకులు శిక్షణ తరగతులకు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

అయిజ: ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు నిర్వహించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులు మురుగును తొలగించారు. వంద రోజుల పారిశుద్ధ్యం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.